క్లుప్తంగా

దొంగలను పట్టుకుంటాం..

హసన్‌పర్తి: నగరంలోని 56వ డివిజన్‌లో జరిగిన చోరీ కేసులో నిందితులను త్వరగా పట్టుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ తెలిపారు. చోరీ జరిగిన గోపాలపురంలోని పోలీస్‌కాలనీ–6 ప్రాంతానికి చెందిన తుమ్మ మనోజ్ కుమార్‌రెడ్డి ఇంటిని శనివారం పరిశీలించారు. సీపీ వెంట స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ దయాకర్, ఎస్సై సతీష్‌కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ చేరదీత

హన్మకొండ: కొద్ది రోజులుగా మతిస్థిమితం లేక తిరుగుతున్న మహబూబాబాద్‌కు చెందిన అఖిలను హరిత కాకతీయ యోగా శిక్షణ కేంద్రం యోగ సాధకులు చేరదీసి హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని సఖి కేంద్రంలో అప్పగించారు. మతిస్థిమితం లేక వరంగల్ రైల్వే స్టేషన్‌లో తిరుగుతుండగా చేరదీసి సఖి సెంటర్‌లో అప్పగించగా ఆమె కుటుంబ వివరాలను నిర్వాహకులు తెలుసుకుని మహబూబాబాద్‌కు పంపించారని యోగా గురువు పోశాల శ్రీనివాస్ శనివారం తెలిపారు.

క్రీడలతో శారీరక ఆరోగ్యం

దేశాయిపేట: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యం లభిస్తుందని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ తోట నరసయ్య లింగం అన్నారు. వాసవి క్లబ్ రీజియన్ –4 చైర్మన్ డాక్టర్ వల్లా పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో దేశాయిపేటలోని సీకేఎం కళాశాల గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన 'రీజియన్ స్పోర్ట్స్ మీట్'కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మారథాన్, చెస్, షటిల్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీకేఎం ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు, మోహన్‌రావు, కార్తీక్ సుతారి, మోహన్, నాగేశ్వర్‌రావు, కిషోర్, రమేష్, లక్ష్మణ్, నాగరాజ్ పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

హన్మకొండ కల్చరల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వేయిస్తంభాల దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5గంటలకు పరశురాందళ్ ఆధ్వర్యంలో దేవాలయం నుంచి హనుమకొండ చౌరస్తా, బస్టాండ్, మచిలీబజార్, కాపువాడ మీదుగా రాగన్న దర్వాజ చిన్నకోవెల వరకు శోభాయాత్ర జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు 'వోపాస్' కమిటీ ఎన్నిక

హన్మకొండ కల్చరల్: వరంగల్ జిల్లా విశ్వ బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం (వోపాస్) సర్వసభ్య సమావేశం, 11వ పాలక మండలి కమిటీ సభ్యుల ఎన్నికను ఆదివారం ఉదయం ఆదర్శ లా కళాశాలలో నిర్వహించనున్నట్లు వోపాస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దోజు విద్యాసాగర్, సభ్యులు గురుబ్రహ్మం, డాక్టర్ చంద్రమౌళి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

4న యూరాలజీలో ఉచిత వైద్యం

నయీంనగర్: స్త్రీలలో మూత్ర సంబంధ వ్యాధుల పట్ల కొత్త రకం వైద్యం, ఆపరేషన్లను జూన్ 4న వరంగల్ యూరాలజికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సొసైటీ జనరల్ సెక్రటరీ డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివరాలకు 70329 16161, 83330 93929 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిత్యావసరాల అందజేత

వరంగల్: నగరంలోని ఎంహెచ్‌నగర్‌లో బీఆర్ఎస్ వల్ల నష్టపోయిన మైబు కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ తూర్పు నాయకుడు కుసుమ సతీష్ అన్నారు. ఈమేరకు మైబు కుటుంబానికి శనివారం నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, డివిజన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సముద్రాల పరమేష్, మార్టిన్ లూథర్, రఘునాథ్‌రెడ్డి, కోట సతీష్, కోమాకుల నాగరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ఖిలా వరంగల్: వేసవిలో తాగునీటి కోసం వరంగల్ 38వ డివిజన్ మధ్యకోట యాదవవాడలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ బైరబోయిన ఉమకు విన్నవించారు. ఆమె వెంటనే స్పందించి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సహకారంతో బోరుకు విద్యుత్ మోటార్‌ను బిగించారు.

ట్రాలీ ఆటోను ఢీ కొట్టిన బస్సు

మడికొండ: ట్రాలీ ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా ఇద్దరు డ్రైవర్లకు గాయాలైన సంఘటన మడికొండలో శనివారం రాత్రి జరిగింది. మడికొండ ఎస్సై నర్సింహారావు వివరాల ప్రకారం స్టేషన్ ఘన్‌పూర్ నుంచి కాజీపేట వైపు మామిడి కాయల లోడుతో వస్తున్న ట్రాలీ ఆటో మడికొండ పెట్రోల్ పంపు వద్దకు రాగానే టైర్ పంచర్ కావడంతో ఇండికేటర్ వేసి పక్కకు ఆపడానికి యత్నిస్తుండగా వెనుక నుంచి ట్రాలీ ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది.

పరామర్శ

కాశిబుగ్గ: వరంగల్ 18వ డివిజన్ ఎస్ఆర్టీ కాలనీకి చెందిన చల్ల శ్యామల (85) అనారోగ్య సమస్యలతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు శనివారం పరామర్శించారు.

వరంగల్ అభివృద్ధికి నిరంతర కృషి

కరీమాబాద్: వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. 42వ డివిజన్ లెనిన్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం గుడిసెవాసులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మేయర్‌గా ఉన్నప్పుడే గుడిసెవాసులు నివాసముండే ప్రాంతాలను అభివృద్ధి చేయడమే కాకుండా జీఓ 58, 59 ద్వారా ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇస్తానని గుర్తుచేశారు. నియోజకవర్గంలో రూ.3,800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే నరేందర్ వివరించారు. ఈ కార్యక్రమంలో లెనిన్‌నగర్ అధ్యక్షుడు బోగి సురేష్, 42వ డివిజన్ ఇన్‌చార్జ్, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్, పలు డివిజన్ల కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్, పల్లం పద్మ, ఓని భాస్కర్, జెడ్ఆర్‌సీసీ మెంబర్ చింతాకుల సునీల్, నాయకులు దుబ్బ శ్రీనివాస్, మర్రి శ్రీనివాస్, కుడా డైరెక్టర్ మోడెం ప్రవీణ్, కర్ర కుమార్, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్


పూలేనగర్ వాసులతో మాట్లాడుతున్న సంధ్యారాణి

పట్టాల పరిశీలన

కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధిలోని మహాత్మాజ్యోతిరావు పూలేనగర్‌ను అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి శనివారం సందర్శించారు. ఈమేరకు జీఓ నంబర్ 58కింద దరఖాస్తు చేసుకున్న గుడిసెవాసులకు ఇటీవల చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పట్టాలు అందజేశారు. కాగా, గుడిసెవాసుల ఇంటి హద్దులను అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో వేసిన గుడిసెవాసులకు కొంతమందికి మాత్రమే పట్టాలు వచ్చాయని, అందరికి వచ్చే విధంగా చూడాలని బాధితులు కోరారు. ఈమేరకు అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ దశరథ రామిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, గుడిసెవాసులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ డిగ్రీ గురుకులాలు ఏర్పాటు చేయాలి

న్యూశాయంపేట: నిరుపేద మైనారిటీల ఉన్నత విద్యకోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బాలికలు, బాలురకు ఒకటి చొప్పున వేర్వేరుగా డిగ్రీ గురుకులాలు ఏర్పాటు చేయాలని టీఎస్ – మెసా, మైనారిటీ రైట్స్ ప్రొటెక్షన్ ఫ్రంట్ (ఎంఆర్‌పీఎఫ్) ప్రతినిధులు కోరారు. ఈమేరకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే, మైనారిటీ గురుకులాలకు పక్కా భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాలు కేటాయించి నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. అనంతరం, సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్డులో నివాసంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను కలిసి నియోజకవర్గంలో ఉన్న మైనారిటీ గురుకులానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మహ్మద్ నయీం, ఎంఆర్‌పీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌మహ్మద్, గౌరవ అధ్యక్షుడు సయ్యద్ అక్బర్, తెలంగాణ మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ తాజొద్దీన్, టీఎస్ – మెసా నాయకులు మహ్మద్ అజీజ్, నన్నే సాబ్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అలరించిన సంగీత విభావరి


సంగీత విభావరిలో పాల్గొన్న గాయకులు

హన్మకొండ కల్చరల్: ఏకశిల కరోకే క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో సంగీత విభావరి నిర్వహించారు. గాయనీ గాయకులు నీరజ, సాగంటి మంజుల, రేవతి, కూజా విజయ్‌కుమార్, గొప్పెట సుధాకర్, ఉపేందర్ తమ గాత్రంతో ఆహుతులను రంజింపచేశారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి ప్రగళ్లపాటి రాజకుమార్ మాట్లాడుతూ ప్రతినెల వివిధ ప్రదేశాల్లో సంగీత విభావరి నిర్వహించి సంగీత ప్రియులకు ఆనందాన్ని పంచాలన్నదే క్లబ్ లక్ష్యమని అన్నారు. తెలంగాణ వికాస సమితి జిల్లా కన్వీనర్ నిమ్మల శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, కార్యక్రమంలో పార్కు వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు ఎల్లగౌడ, దశరథ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు సముచిత స్థానం

కేయూ క్యాంపస్: రాష్ట్రం ఏర్పాటయ్యాక బడుగు, బలహీన వర్గాలకు సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పిస్తున్నారని పెరిక కుల ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పెప్సీ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. గ్రేటర్ వరంగల్ పెప్సీ కార్యవర్గ సమావేశాన్ని కాకతీయ యూనివర్సిటీలోని జర్నలిజం విభాగంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల టెన్త్, ఇంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతిభ చూపిన పెరిక కుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయాలని నిర్ణయించారు. పెరిక కుల జాతీయ వధూవరుల పరిచయ వేదికను కూడా ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో పెప్సీ బాధ్యులు ముత్తయ్య, శ్రీరామ్‌వీరయ్య, సతీష్‌కుమార్, కేదారి, శ్రీధర్ల బుచ్చిమల్లు, మహేష్, రజిత, రాజయ్య, మన్నె వీరన్న, గొల్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ సంగాని మల్లేశ్వర్

పేదల ఆరోగ్యానికి భరోసా 'సీఎంఆర్ఎఫ్'


ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: నిరుపేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 65వ డివిజన్ దేవన్నపేటకు చెందిన లావుడ్య లక్ష్మి పేర మంజూరైన రూ.90వేల విలువగల ఎల్ఓసీని హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని స్వగృహంలో ఎమ్మెల్యే శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధుల చికిత్సకు సీఎంఆర్ఎఫ్ కింద ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుగులోతు రాజునాయక్, ఆత్మ డైరెక్టర్ పంజాల భూపాల్, మాజీ సర్పంచ్ చుంచు రవి, నాయకులు ఎల్లావుల కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వరంగల్: వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లి గ్రామానికి చెందిన జన్ను సుందర్ తల్లి జయమ్మ ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు జన్ను అనిల్‌కుమార్, విజయ్ పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను (జేపీఎస్) రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీలోని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ గేట్‌వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. కేయూ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి యాదవ్ మాట్లాడుతూ 14 రోజులుగా జేపీఎస్‌లు సమ్మె చేస్తున్నా వారి డిమాండ్ల పట్ల ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోవటం శోచనీయమని వాపోయారు. సమ్మె విరమించకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం దారుణమని విమర్శించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోనిది ప్రభుత్వ హత్య అని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్, బీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు ప్రశాంత్, కేయూ బీసీ విద్యార్థి సంఘం ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు, జేఏసీ బాధ్యులు కాశీనాథ్, మహేష్, నిరంజన్, చంటి, ప్రీతం, నరేందర్ పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో 'తాళ్ల పద్మావతి' ప్రతిభ

కరీమాబాద్: వరంగల్ నగరంలోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం తెలిపారు. పాఠశాల ప్రారంభం నుంచి వివిధ అంశాల్లో ప్రతిభ చూపుతూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్న విద్యార్థులు.. సీబీఎస్ఈ ఫలితాల్లో మెరుగైన మార్కులు సాధించారని అన్నారు. మొదటి ప్రయత్నంలోనే తొలి బ్యాచ్‌లో 100శాతం ఉత్తీర్ణత వచ్చిందని వివరించారు. ఈక్రమంలోనే పాఠశాలకు చెందిన శుభద 473 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలవగా, ఆమెను చైర్మన్ మల్లేశంతోపాటు డైరెక్టర్లు డాక్టర్ వరుణ్, వైష్ణవి, ప్రిన్సిపాల్ స్వర్ణ అభినందించారు.



శుభదను అభినందిస్తున్న చైర్మన్, ఉపాధ్యాయులు

సోని కుటుంబాన్ని ఆదుకోవాలి

కేయూ క్యాంపస్: ఆత్మహత్య చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శి సోని కుటుంబాన్ని ఆదుకోవాలని కాకతీయ యూనివర్సిటీలోని పలు విద్యార్థి సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. క్యాంపస్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ తీగల ప్రేమ్‌సుందర్ మాట్లాడుతూ జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయకుండా ప్రభుత్వం వారికి అన్యాయం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేష్‌కృష్ణ, బీసీ సంఘం నాయకులు ప్రశాంత్, జేఏసీ బాధ్యులు కాశి కల్యాణ్, వెంకటేష్, శ్రీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌కు కొవ్వొత్తులతో నివాళి

వరంగల్ చౌరస్తా: ఉద్యోగ భద్రత కోసం ఉద్యమిస్తూ అసువులు బాసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోని ఆత్మకు శాంతి చేకూరాలని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వరంగల్ పోస్ట్ ఆఫీస్ నుంచి చౌరస్తా వరకు జరిగిన ర్యాలీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, వరంగల్ తూర్పు నాయకులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ ఖానాపూర్ మండలం రంగాపూర్ గ్రామ పంచాయతీ జూనియర్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బైరి సోని.. ప్రభుత్వ ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రత్నం సతీష్‌షా, బాకం హరిశంకర్, ఎరుకల రఘునాథ్ రెడ్డి, గడ్డల కుమార్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, ఆడెపు వెంకటేష్, సుమన్ కత్రీ, కందిమల్ల మహేష్, ముత్తినేని శ్రీనివాస్, ఒంటెల ప్రసాద్, కోట సతీష్, కోమాకుల నాగరాజు, పలు డివిజన్ల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వేసవి శిబిరాలు

విద్యారణ్యపురి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సమ్మర్ క్యాంపుల పేరుతో నడుపుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దుచేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అశోక జంక్షన్‌లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దిష్టిబొమ్మలను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు మిశ్రీన్ సల్తానా, జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వమే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, బాధ్యులు నవీన్, సాయి, కోట్లర్, క్రాంతికిరణ్, రూపేష్, రత్నాకర్, రాహుల్ పాల్గొన్నారు.

'పొలిమెర' వంశీయుల ఆత్మీయ సమ్మేళనం



కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ ఫాస్టల్ సెంటర్‌లో పొలిమెర గోపయ్య మల్లమ్మ సంతానం 5 తరాల వంశవృక్షం ఆత్మీయ సమావేశాన్ని పోగుల శోభారాణి అనిల్‌కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కార్పొరేట్ యుగంలో ఎక్కడెక్కడో స్థిర పడిన సుమారు 300 మందికి పైగా బంధువులు ఒకే వేదికపై కలుసుకున్నారు. కార్యక్రమంలో బలగం సినిమా ఫేమ్ మొగిలయ్య, కొమురమ్మలను ఆహ్వానించి వారి పాటలతో ఆనందాన్ని పొందిన పొలిమెర వంశీయులు వారికి ఆర్థిక సహాయం అందజేశారు.

కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుపై హర్షం


రామన్నపేట: సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

రామన్నపేట / హసన్‌పర్తి / కాజీపేట /ఖిలా వరంగల్/కాశిబుగ్గ / వరంగల్ చౌరస్తా /మడికొండ : కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా నగరవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. 11వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి రాహత్‌ఫర్వీన్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. హసన్‌పర్తి, వంగపహాడ్ గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, నాయకుడు సిద్దం రాము ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ పెట్రోల్‌బంక్ జంక్షన్, పడమరకోట అమర వీరుల స్తూపం, తూర్పుకోట హనుమాన్ జంక్షన్‌లో సిద్ధం రాము, బెడిద వీరన్న ఆధ్వర్యంలో సంబరాలను జరుపుకున్నారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఆధ్వర్యంలో తెలంగాణ జంక్షన్‌లో సంబరాలు నిర్వహించారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, సిద్దం రాము ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు. మడికొండ చౌరస్తాలో నాయకులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.


మడికొండ చౌరస్తాలో బాణసంచా కాల్చుతున్న నాయకులు

బ్యాగ్ తారుమారు.. తిరిగి అప్పగింత

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీసులు శనివారం ఒక ప్రయాణికుడికి బంగారు ఆభరణాల బ్యాగును అప్పగించారు. శుక్రవారం సాయంత్రం గోరంటాల రాజేశ్వర్‌రెడ్డి అతని భార్య జ్యోతి ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో కాకతీయ ప్యాసింజర్ ఎక్కి ఘన్‌పూర్‌కు వెళ్తున్నారు. రాత్రి 9 గంటలకు ఘన్‌పూర్‌లో రైలు దిగేటప్పుడు భార్యాభర్తలు వారి బ్యాగుకు బదులు వేరే వారి బ్యాగును తీసుకొని ఇంటికెళ్లారు. తెరిచి చూడగా తమది కాదని తెలుసుకొని వెంటనే కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. తన బ్యాగులో సుమారు రూ.2లక్షల 50 వేలవిలువ గల బంగారు ఆభరణాలున్నట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు అప్రమత్తమై సీసీ ఫుటేజీల సాయంతో ఆ బ్యాగ్‌ను తీసుకెళ్లింది హనుమకొండకు చెందిన టి.లక్ష్మణ్‌గౌడ్ అని గుర్తించారు. ఎవరి బ్యాగ్‌ను వారికి అప్పగించినట్లు సీఐ రాంమూర్తి తెలిపారు.